# శివ మహాత్మ్యం-శివరాత్రి ప్రాశస్త్యం



"వందే శంభు ముమాపతిం సురగురం వందే జగత్కారణంవందే పన్నగ భూషణం మృగధరం వందే పశూనాం పతిం వందే సూర్య శశాంక వహ్ని నయనం వందే ముకుంద ప్రియంవందే భక్తి జనాశ్రయంచ వరదం వందె శివం శంకరం "

పరమేశ్వరుని ఆరాధనకు, ఆయనను ప్రసన్నం చేసుకోవడానికీ ఆలంబనమీ దివ్య శ్లోకం.

మహేశ్వరుని ఆకారాది వివరాలు, అయనలోని మహిమాన్విత లక్షణాలు, గుణాలు ఈ శివస్తోత్రంలో మనకు గోచరిస్తాయి. శివ నామం ఎంతో మహత్తరమైనది, మధురమైనది. "మహాదేవ! మహాదేవ! మహాదేవ!" అని ప్రాత:కాలంలో స్మరిస్తే....మొదటి స్మరణం వల్ల పూర్వజన్మ పాపం నశిస్తుంది.

రెండో స్మరణం ఈ జన్మలో ఆయురారోగ్య ఐశ్వర్యాలు అందిస్తుంది.

మూడో స్మరణం వల్ల రాబోవు జన్మ ఎంతో ఉత్తమమైనదిగా ఉంటుంది.

ఇది మన పురాణాలు, పెద్దలు వెల్లడిస్తున్న విషయం.

శివభక్తులకెన్నడూ కష్టాలుండవు. చివరకు మృత్యువు కూడా శివభక్తుల దరిచేరడానికి సంశయిస్తుంది. మార్కండేయుని వృత్తాంతం చెబుతున్నది ఇదే కదా! పంచాక్షరి మంత్రం విశిష్ట శక్తిని మనమీ సందర్భంగా గుర్తుచేసుకోవాలి కూడా! ఎందుకంటే ఈ మంత్రంలోనే సకల దేవతలూ కొలువై ఉన్నారు.

'ఓం నమః శివాయ' ఇదీ పంచాక్షరీ మంత్రం.

ఈ మంత్రంలోని 'ఓం' కారంలో విశ్వబ్రహ్మ, 'న' కారంలో శివుడు, 'మ' కారం లో విష్ణుమూర్తి, 'శి' కారంలో బ్రహ్మ, 'వ' కారంలో ఇంద్రుడు, 'య' కారంలో సూర్యుడు కొలువై ఉన్నారని మన ఋషుల వాక్కు.

ఈ మాటనే కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి దివ్య వచనాలలో చెప్పుకోవాలంటే

"వేదాలలో యజుర్వేదం గొప్పది. యజుర్వేదంలోని నాలుగవ కాండలో ఉన్న రుద్రం మధ్యలో ఉన్న పంచాక్షరీ మంత్రం అంతకంటే గొప్పది. పంచాక్షరీ మంత్రంలోని 'శివ' మరింత గొప్పది. 'శివ' అంటే మంగళమని అర్థం"

శివనామం ఎంతో మహత్తు కలది. పంచక్షరీ మంత్రమే దేవతల ఆవాసము

శివనామమే ఇంతటి శక్తి వంతమైనదైతే మరి శివుడికి ఎంత శక్తి ఉండాలి?

మహా శక్తి శాలి, భూతనాథుడైన పరమేశ్వరుని కృప అత్యంత సులభంగా పొందాలంటే శివరాత్రి రోజు ఆయనను పూజిస్తే చాలు. ఆ రోజు పూజ చేసిన వారికి పరమేశ్వరుని కృపే కాదు మరణానంతరం మోక్షం కూడా పొందగలరు. పరమేశ్వరునికి ప్రీతికరమైన ఆ శుభదినం ఇప్పుడు మన ముందే ఉన్నది. నెలకు ఒక్కో శివరాత్రి వస్తుంటుంది. అలాంటప్పుడు మాఘ కృష్ణచతుర్దశి నాడు వచ్చే ఈ మహా శివరాత్రి ప్రత్యేకత ఏమిటి? అంటే ....

దేవ దానవులు క్షీరసాగర మధనం చేస్తున్నప్పుడు హాలాహలం జనించింది కదా! ఆ హాలాహలాన్ని పరమేశ్వరుడు స్వీకరించి, లోక రక్షణ గావించినదీనాడే అని ఒక కథనం. ఇదే విషయం మీద మరో కథనం ఏమిటంటే బ్రహ్మ, విష్ణుమూర్తులకు లింగాకారంలో శివ భగవానులు తొలిసారి గోచరించినది ఈ నాడే. ఆ సందర్భంలోనే తన మహోన్నత రూపాన్ని బ్రహ్మ, విష్ణుమూర్తిలకు తెలియజేసి వారి పూజలందుకున్నదీ ఈ రోజునే నట. మాఘకృష్ణ చతుర్దశి నాడు శివుడు లింగాకారంలో ఉద్భవించాడు కనుకే ఈ రోజు ఆయనకు ప్రీతికరమైనది అని చెబుతారు

నిరాకారుడైన శివుడు జ్యోతి రూపంలో లింగాకారంగా ఆవిర్భవించిన సమయం కనుక శివరాత్రిని లింగోద్భవకాలమని అంటారు. లింగోద్భవ సమయం ఆరోజు అర్ధరాత్రి పన్నెండు గంటలకు. కనుకనే శివరాత్రి రోజు భక్తులు అర్ధరాత్రి సమయంలో భక్తులు శివుని పూజించేది.

పరమేశ్వరుని మనోహర రూపాల్లో మరొకటి అర్థనారీశ్వర రూపం. సగం దేహం పార్వతి దేవిగా, మిగిలిన భాగం పరమేశ్వరునిగా కన్పించే ఈ రూపం ఆధ్యాత్మిక పరంగా, ఎన్నో అర్థాలు వివరిస్తుంటుంది. ఈ అర్థనారీశ్వర రూపాన్ని ఆది శంకరాచార్యులు ఎలా కీర్తించారో చూడండి



అంబోధర శ్యామల కుంతలాయై
తటిత్ప్రభాతామ్ర జటాధరాయ
దివ్యాంబరాయై చ నమశ్శివాయ
నమశ్శివాయై చ నమశ్శివాయ
ప్రదీప్త రత్నో జ్వల కుండలాయై
స్ఫురన్మహా పన్నగ భూషణాయ
శివాన్వితాయై చ శివాన్వితాయ
నమశ్శివాయై చ నమశ్శివాయ

“ మేఘాల వంటి వినీల కేశాలు కల్గి పక్కనే జటాజూటముతో వెలుగొందువాడు, ఒక వైపు దివ్యాంబరము, మరోపక్క దిగంబరత్వము చూపువాడు, ప్రకాశవంతమైన మణిమయ రత్న కుండలాలు ఒక వంక, మరో పార్శ్వమున సర్పహారం ఆభరణాలుగా చేసుకుని శక్తి స్వరూపం, శివరూపాన్ని ఏకకాలంలో చూపుతున్న పార్వతీ పరమేశ్వర ఏక స్వరూపమునకు నమస్సులు ” అంటూ స్తుతించారాయన.

శివుడెప్పుడూ పార్వతీ సమేతుడే. శివుని ప్రార్థిస్తే శక్తి స్వరూపిణి అయిన పార్వతీమాతను కూడా ప్రార్థించినట్టే! కాబట్టి

శివుని భక్తి శ్రద్ధలతో పూజిస్తే సర్వమంగళకారిణి అయిన పార్వతీ దేవి అనుగ్రహం కూడా మనకు కలుగుతుందని పెద్దలు అంటారు.

శివుడు అభిషేకప్రియుడు. శివారాధనకు అవసరమైన ద్రవ్యాలు ఆర్థిక పరంగా చూసిన అంత ఖరీదైనవేం కాదు. కానీ ఆధ్యాత్మిక పరంగా ఎంతో ఉన్నతమైనవి. లింగోధ్భవ సమయాన " హరహరమహాదేవ " అంటూ శివలింగంపై కనీసం ఒక్క బిళ్వ పత్రాన్ని ఉంచి శివభగవానుని మనసారా ధ్యానిస్తే సకల శుభాలు కలుగుతాయి.

పరమ మంగళకరమైనది శివరూపం. ఆ స్వరూపాన్ని అనుసంధానం చేసుకోదలచిన వారు మొదట చేయవలసింది వి భూతి ధారణ. విభూతి అంటే ఐశ్వర్యం. అది అగ్నిలో కాలిన శుద్ధమైన వస్తువు. అదీకాక ఈశ్వరుడు వంటినిండా వి భూతి రాసుకుంటాడు. శివ భక్తులు చేయవలసిన రెండవ పని రుద్రాక్ష ధారణ. రుద్రాక్ష అంటే మరేదో కాదు. పురాణాలలోని కధలను ఆధారంగా చూస్తే రుద్రాక్షలు శివుని అశ్రువుల నుంచి జనించాయని తెలుస్తోంది. మరో కథనం ప్రకారం శివుని మూడో కన్నే రుద్రాక్ష. పరమేశ్వరుని దేహం నుంచీ జనించినవి అయిన ఆ రుద్రాక్షలను ధరిస్తే ఎంతటి శుభాలు కలుగుతాయో కదా!

. ఈ రుద్రాక్షలలో ఎన్నో వర్గాలున్నాయి. ప్రధానంగా శ్వేత వర్ణం, రక్త వర్ణం, పీత వర్ణం, కృష్ణ వర్ణం రుద్రాక్షలను ధరిస్తుంటారు. రుద్రాక్ష ముఖాల ఆధరంగా చూస్తే ఏకముఖ రూద్రాక్ష నుంచి చతుర్ధశ రుద్రాక్షల వరకు మనకు లభ్యమవుతుంటాయి. ఇక రుద్రాక్షలలో కూడా రెండు రకాలున్నాయి రుద్రాక్ష, భద్రాక్షలని వాటికి పేరు.

రుద్రాక్షల్లో ఏకముఖ రుద్రాక్ష ఎంతో మహత్తు కలిగినదట.

" ఏకవక్రంతు రుద్రాక్షం పరతత్వ స్వరూపకమ్ "

ఏకముఖ రుద్రాక్ష సాక్షాత్తు శివుడు పరబ్రహ్మ స్వరూపము

" ఓం హ్రీం నమ: " అని జపిస్తూ రుద్రాక్ష ధరించాలి.

ద్వీముఖ రుద్రాక్ష అర్ధనారీశ్వరునికి ప్రతిరూపం. దీనిని ధరిస్తే పార్వతీ పరమేశ్వరులు ప్రసన్నమవుతారు

" ఓం నమ: " అనే మంత్రం జపిస్తూ ద్వీముఖ రుద్రాక్ష ధరించాలి.

ఐశ్వర్యాన్ని కాంక్షించే వారు త్రిముఖ రుద్రాక్ష, సంతానం కొరుకునే వారు చతుర్ముఖ రుద్రాక్ష ధరించాలి. పంచముఖ రుద్రాక్ష ధరిస్తే సకల పాపాలూ పటాపంచలవుతాయి.

శివుని కృప కోరేవారు శివరాత్రి ఉదయాన లేచి నదిలోకాని, కాల్వలోకానీ, చెరువులోకానీ ఇవేవి అందుబాటులో లేని పక్షంలో ఇంట్లోనే అభ్యంగన స్నానం చేసి శివునికి అభిషేకం జరిపి ఉపవాసముండి, లింగోద్భవ సమయంలో ` బిళ్వపత్రాలతో శివుని పూజించాలి.

బిళ్వ పత్రాలంటే మారేడు దళాలు.మారేడు దళాలపై లక్ష్మీదేవి నివాసముంటుంది. శివునికి ఉన్నట్టే మారేడుకీ మూడు దళాలుంటాయి. మారేడు దళాల వెనుక వైపు లక్ష్మీదేవి నివాసముంటుంది కాబట్టి మారేడు దళాల వెనుక భాగం శివలింగానికి తగిలేట్టు పూజ చేస్తారు.

శివ భక్తులు ఎల్ల వేళలా మదిలో శివ నామం జపిస్తుండాలి.
అభిషేక ప్రియుడైన పరమేశ్వరుని పంచామృతాలతో అభిషేకించాలి. అంటే... పాలు, పెరుగు, పేరిన నెయ్యి, తేనె, టెంకాయి నీరు, వీటిలో పాలతో అభిషేకించడం వల్ల జ్ఞానం, సంతానప్రాప్తి, పెరుగుతో అభిషేకించడం వల్ల దేహప్రీతి నశించడం, నేతితో అభిషేకించబడటం వల్ల విషయ సేకరణ పిపాస పెరగడం, టెంకాయి నీరుతో అభిషేకించడం వల్ల అహంకారం అంతరించడం వంటివి మానవులకు కలుగుతాయని ఋషులు చెప్పారు.


శ్రీ శైల మల్లికార్జున స్వామి

అభిషేకాలు ఎనిమిది విధాలు. అవి
ధారాభిషేకం:- పృధ్వీ రూపధారి అయిన రుద్రునికి ఈ అభిషేకం మహా ప్రీతి. ఇది పాప హరం.

అవృత్తాభిషేకం:- జల రూపధారి అయిన శివునికి ఈ అభిషేకం ఇష్టం. ఇది సుఖాలను కలుగజేస్తుంది.

రుద్రాభిషేకం:- తేజో రూపధారి అయిన శంకరునికి ఇష్టమైన అభిషేకం ఇది. సర్వ సంపదాభివృద్ధిని ఇస్తుందిది.

శత రుద్రాభిషేకం:- ఆకాశ రూపధారి అయిన మహేశ్వరునికి ప్రీతి కరమైన అభిషేకం ఇది. పుత్ర పౌత్రాభివృద్ధి, ఐశ్వర్యాలను ఇస్తుంది.

లఘు రుద్రాభిషేకం:- సూర్య రూపధారి అయిన రుద్రునికి ఇష్టమైన అభిషేకం ఇది. పునర్జన్మను నివారిస్తుంది.

మహా రుద్రాభిషేకం:- చంద్ర రూపధారి అయిన మహా శివునికి ప్రీతికరమైనదిది. దీని వల్ల జ్ఞాన వృద్ధి

అతి రుద్రాభిషేకం:- సర్వ రూపమైన జగదీశ్వరునికి ప్రీతి కలిగించే అభిషేకం ఇది. మహాఫల సిద్ధి దాయకమీ అభిషేకం.

పరమేశ్వరుని ఏ విధంగా అభిషేకించాలో కంచి కామ కోటి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతి ఇలా వివరిస్తున్నారు.

"మొదట శుద్ధ జలంతో , తరువాత వరుసగా పాలు, నెయ్యి, పెరుగు, తేనె, పళ్లరసం మొదలైన వాటితో అభిషేకించాలి. తిరిగి శుద్ధజలతో అభిషేకించి చివరలో చందనాభిషేకం చేయాలి. మరల శుద్ధ జలంతో అభిషేకించి ఆ నీటిని తీర్థంగా స్వీకరించాలి. అమ్మవారి విగ్రహానికి కొద్దిగా పసుపు కలిపి అభిషేకించాలి.

అభిషేకానంతరం విగ్రహ మూర్తులను శుద్ధజలంతో శుభ్రం చేసి తెల్లని వస్త్రంతో తుడిచి పీట మీద పెట్టాలి.చందనం, కుంకుమ అద్ది పువ్వులతో అర్చన చేయాలి.



అర్చన విధానం తెలిసిన వారి ద్వారా చేయించుకోవాలి. అనంతరం ధూపం, దీపం చూపించి నైవేద్యం పెట్టి, స్వామికి తాంబూలం సమర్పించి, దీపారాధన చేసి పుష్పాలతో అర్చించి నమస్కారం చేయాలి".

భక్తులు ఈ రీతిన ఈ శివరాత్రినాడు శివుని అర్చించి, ఆ గరళకంఠుని కృపకు పాత్రులగుదురు గాక!